క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సహాయం అందజేత

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 25 వ వార్డు క్రిస్టియన్‌పేటకు చెందిన ఆదూరి నాగలక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటూ మంగళవారం మృతి చెందింది. ఈ సందర్భంగా ఆమెకు వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి తక్షణ సహాయంగా మంజూరైన రూ.10 వేలను బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మృతురాలి కుమారుడు రవికి అందజేశారు. డెత్ సర్టిఫికెట్ వచ్చిన వెంటనే మిగతా డబ్బులు నామిని అకౌంట్‌లో జమ అవుతాయన్నారు. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ జార్జి, నాయకులు శామ్యూల్, నాగయ్య, సచివాలయం సిబ్బంది, వలంటీర్ పాల్గొన్నారు.

నేడు కంచికచర్లలో గుర్రం జాషువా జయంతి

కంచికచర్ల: మహాకవి, నవయుగ కవితా చక్రవర్తి, గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగనుందని బహుజన రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పాల్గొంటారని, ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల కళాకారులు, కవులకు సత్కార కార్యక్రమం ఉంటుందని సోనీ తెలిపారు.

రాజకీయపక్షాలతో ఆర్డీఓ సమీక్ష

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ ఎ.రవీంద్రరావు అన్ని రాజకీయ పక్షాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఇంటింటి సర్వేకు సంబంధించి వచ్చిన క్లెయిమ్స్ , తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు అవసరమైన అన్ని అంశాలపై రాజకీయ పక్షాల నాయకులతో చర్చించారు.

జిల్లా స్థాయి పోటీలకు 23 మంది ఎంపిక



వత్సవాయి: ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు మండల కేంద్రం వత్సవాయి జెడ్పీ పాఠశాల నుంచి 23 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం కాకాని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ నెల 22 నుంచి 26 వరకు జగ్గయ్యపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలలో అండర్ 14–10 మంది, అండర్–17 13 మంది కబడ్డీ, ఖోఖో ఆటలలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వారిని ఉపాధ్యాయులు, పీడీ మార్కపూడి బాబురావు ప్రత్యేకంగా అభినందించారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు



పెనుగంచిప్రోలు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఇంటి వద్దనే అందుతాయని వైద్యాధికారి పి.ఇందిర అన్నారు. గ్రామంలో బుధవారం ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వే అనంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరుధాన్యాల వలన మంచి ఆరోగ్యంతో పాటు రక్తహీనత తగ్గుతుందన్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

వీరులపాడు: రైతులు విధిగా తమ పంటలకు ఈ–క్రాప్ చేయించుకోవాలని, ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు, పంట నష్ట పరిహారం అందుతుందని వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోగా రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

గంగమ్మ ఒడికి తరలివెళ్లిన గౌరీ తనయుడు



కంచికచర్ల బంక్ సెంటర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

నందిగామ: పట్టణంలోని గాంధీ సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడి విగ్రహం బుధవారం రాత్రి నిమజ్జనానికి తరలి వెళ్లింది. చవితి రోజు నుంచి పూజలు అందుకున్న గౌరీ తనయుడు మేళ తాళాలు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గంగమ్మ ఒడికి తరలి వెళ్లాడు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో స్వామివారిని ఊరేగించారు. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వినూత్న నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

గణపతి పప్పా మోరియా

కంచికచర్ల: వినాయక చవితి పురస్కరించుకుని స్థానిక మోడల్ కాలనీ, పెట్రోలు బంక్ సెంటర్, వసంత కాలనీ, పోలీస్‌స్టేషన్ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడి విగ్రహ ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి వారికి విశేష పూజలు చేశారు. పెట్రోలు బంక్ సెంటర్‌లో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన బాల వినాయకుడి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 500 మందికి అన్న సమారాధన చేశారు. మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద భక్తులు విశేష పూజలు చేశారు. 1500 మందికి అన్న సమారాధన చేశారు. పూజా కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుదే సరస్వతి, మాజీ సర్పంచి గుదే రంగారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుదే అక్కారావు, నాయకులు తాటుకూరు గంగాధరరావు, అమ్మారావు, రాఘవరావు, వెంకటేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పరిటాల, మోగులూరు, చెవిటికల్లు, కీసర, పెండ్యాల, వేములపల్లి, గనిఆత్కూరు తదితర గ్రామాల్లో వినాయకునికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు

పెనుగంచిప్రోలు: మండలంలోని పలు గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు చవితి పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు పదో రోజు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఊరేగింపు అనంతరం విగ్రహాన్ని స్థానిక మునేరులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలుతో పాటు పలు గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్ మోతలు, బాణసంచా మెరుపుల మధ్య జరిగాయి. ఊరేగింపుల అనంతరం విగ్రహాలను స్థానిక మునేరులో నిమజ్జనం చేశారు.

కొనసాగుతున్న చవితి వేడుకలు

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా పలుచోట్ల చవితి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని వాసవి మార్కెట్, ముక్కోటి మండపం, పాత బస్టాండ్, మెయిన్ బజార్ లలో ఏర్పాటు చేసిన చవితి పందిళ్ల వద్ద బుధవారం విశేష పూజలు నిర్వహించారు. వాసవి మార్కెట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ గణనాథుడి విగ్రహం వద్ద లోక శాంతి కోసం పలు రకాల హోమాలు జరిపించారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలో బుధవారం పదవ రోజున పలు వార్డులలోని మండపాలలో కొలువై ఉన్న గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు, భజనలు, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక 22 వ వార్డు నాగమయ్య బజారులో శ్రీగణేష్ యూత్ కమిటీ ఏర్పాటుచేసిన గణనాథుని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. 23 వ వార్డు మంగలిబజారులోని మండపం వద్ద వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు కనిగిరి సుబ్బారావు, పునుగుపాటి పుల్లారావు, దువ్వల రామకృష్ణ, పునుగుపాటి చిన్న, కమటాల మహేష్, మందుల తేజ, కనిగిరి భాను, షేక్ మున్నా పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలి వెళుతున్న నందిగామ గాంధీ సెంటర్‌లో ఏర్పాటుచేసిన గణనాథుడు



నందిగామలో నిమజ్జన కార్యక్రమం సందర్భంగా డప్పు నృత్యాలు



పేటలోని నాగమయ్య బజారులో పూజా కార్యక్రమంలో సామినేని వెంకటకృష్ణ ప్రసాద్



గొట్టుముక్కలలో వినాయకుడికి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో గణనాథుని నిమజ్జన ఊరేగింపు



పెనుగంచిప్రోలు బురుజు సెంటర్‌లోని గణనాథుని ఊరేగింపు

గ్రామంలో డెంగీ జ్వరాలు లేవు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఎక్కడా డెంగీ జ్వరాలు లేవని మలేరియా విభాగానికి చెందిన సబ్ యూనిట్ అధికారి మిరియాల శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం గ్రామంలో జ్వరంతో మంగళవారం మృతి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని తీగల వెంకటరమణ గృహానికి స్థానిక వైద్య సిబ్బందితో కలిసి వెళ్లారు. ఆమె చికిత్సకు సంబంధించిన ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వెంకటరమణ జ్వరంతో పాటు లివర్ ఎన్‌లార్జ్ అవటంతో మృతి చెందిందన్నారు. డెంగీ అని ఎక్కడా నిర్ధారణ కాలేదన్నారు. డెంగీ నిర్ధారణ మనకు విజయవాడ జీజీహెచ్‌లో మాత్రమే అందుబాటులో ఉందన్నారు. దీనికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపామన్నారు. దీనిపై కొందరు అపోహలు సృష్టించటం మంచిది కాదన్నారు. పరిసరాల్లో 130 గృహాలను సర్వే చేయగా ఇద్దరికి మాత్రమే జ్వరాలు ఉన్నాయని, అవి కూడా జలుబు, జ్వరం మాత్రమే అన్నారు. ఆ ప్రాంతంలో గ్రామ పంచాయతీ వారు దోమల మందు స్ప్రే చేయటంతో పాటు ఫాగింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మలేరియా అధికారి శ్రీనివాసరావు, పక్కన సర్పంచ్ పద్మకుమారి

సీఎం బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీన విద్యాధరపురం, ఆర్టీసీ డిపో సమీపంలోని మినీ స్టేడియంలో చేపట్టిన ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర పథకం ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు బుధవారం పోలీసు అధికారులతో కలసి నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా సభా వేదిక, పరిసర ప్రాంతాలను పరిశీలించి బందోబస్త్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. సభా ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులకు, ప్రజలకు ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. బందోబస్తు ఏర్పాట్లలో ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా భద్రతాపరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మనిష్ కుమార్ సిన్హా, డీసీపీలు విశాల్ గున్ని, అజిత వేజెండ్ల, ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, పశ్చిమ ఏసీపీ కె.హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు ఉన్నారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు

విజయవాడకల్చరల్: సుమధుర కళానికేతన్, ఆంధ్రనాటక కళాసమితి, సిద్ధార్థ అకాడమీ, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే తెలుగు ఉభయ తెలుగు రాష్ట్రాల యువ నాటికల పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. బుధవారం ప్రదర్శించిన నవచైతన్యం నాటక సమాజం విశాఖపట్నం వారి ఇంతింతై నాటికను ప్రదర్శించారు. రచన దర్శకత్వం మీగడ శశిభూషణ్, రెండో నాటికగా జాబిల్లి కల్చరల్ సొసైటీ నిజామాబాద్ వారి అసుసర వేదం నాటికను ప్రదర్శించారు. నాటకీకరణ పనసాల, దర్శకత్వం డాక్టర్ మల్లేష్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ యువతలో సాంస్కృతిక భావన దేశ భక్తి, కనిపించడంలేదన్నారు. యువతను కళారంగం వైపు మళ్లించాలని సూచించారు. నూతన నటులు, రచనలు రావాల్సిన అవసరముందని తెలిపారు. వాసవ్య మహిళామండలి ప్రతినిధి జి.రశ్మి, జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు పరచూరి అజయ్‌కుమార్ ఎంబీవీకే కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు. నాటక రచయితలకు దృశ్యవేదిక సభ్యులు నగదు బహుమతిని అందజేశారు. కపిరాజు, ముళ్ల తీగలు నాటికలను గురువారం ప్రదర్శిస్తారు. జాషువా 128 జయంతి వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు బి.ఆంజనేయరాజు, నరేన్ తెలిపారు.



అసురవేదం నాటికలోని సన్నివేశం

నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు

విజయవాడకల్చరల్: నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరరావు అని శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. శ్రీ కళాభారతి సంస్థ వార్షికోత్సవం, అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలను గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ కృష్ణాజిల్లా ముద్దుబిడ్డ అక్కినేని నాగేశ్వరరావు అని అభివర్ణించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ శ్రీ కళాభారతి సాంస్కృతిక సేవా సంస్థ ఎందరో నూతన నటులను పరిచయం చేసిందన్నారు. కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ మాట్లాడుతూ శ్రీకళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి పెద బ్రహ్మం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించారన్నారు. హనుమంతరాయ గ్రంథాలయ అభివృద్ధికి అక్కినేని కృషి చేశారని గుర్తు చేశారు. మల్లాది స్వాతి, పావని, రసూల్, చంద్రశేఖర్, శ్యాం ప్రసాద్, డేవిడ్ రాజు అక్కినేని నటించిన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. మాడుగుల రామకృష్ణ నిర్వహించారు.



అక్కినేని శతజయంతి సభలో మాట్లాడుతున్న శింగంశెట్టి చంద్రశేఖర్

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వీరులపాడు: రైతులు సమగ్ర వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించటం వల్ల పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చని ఉద్యాన శాఖాధికారి నీలిమ అన్నారు. మండలంలోని చౌటపల్లి, కొణతాలపల్లి గ్రామాలలోని మిర్చి తోటలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం జెమినీ వైరస్ అధికంగా ఉందన్నారు. వైరస్ సోకిన పంటలను తొలగించిన రైతులు తిరిగి అదే తోటలో మిర్చి పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. తిరిగి అదే భూమిలో సాగు చేసే రైతులు నారును ఇమిడా క్లోప్రిడ్ లీటరు నీటికి 2మి.లీ. లేదా వేప నూనె 10 వేల పీపీఎంకు లీటరు నీటికి 2 మి.లీటర్లలో ముంచి కొత్తగా నాటుకోవాలని సూచించారు. దుక్కిలో ఎకరాకు క్వింటా చొప్పున వేప పిండిని వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట సంగయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు కోట రామారావు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ విద్యార్థులు అండర్–19 స్కూల్‌గేమ్స్ రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఎస్.జీవన్ ప్రశాంత్, పి.సురేష్, జి.దుర్గా తరుణ్ బాలుర విభాగంలో, తొమ్మిదో తరగతి చదువుతున్న ఐ.పావని, సీహెచ్ సునీత, బాలికల విభాగంలో రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో స్టాండ్ బైగా ఎస్.ప్రియాంక ఎంపికయింది.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై సమీక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట):జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను నిష్పక్షపాతంగా చేయాలని ఎంపీడీవో రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణపై ఆరోగ్య సిబ్బంది పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 సచివాలయాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఈ నెల 30 నుంచి నిర్వహిస్తామన్నారు. అందుకు వలంటీర్‌లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో సురక్ష సర్వేలను ఆరోగ్య సిబ్బంది నిర్వహించారని చెప్పారు. ఈ నెల 30న బలుసుపాడు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో నలుగురు వైద్యులతో పాటు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల గ్రామంలో సర్వే నిర్వహించిన వలంటీర్‌లు, ఆరోగ్య సిబ్బంది సర్వే ప్రకారం కేస్ షీట్ ద్వారా రోగులను గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. అనంతరం శిబిరాలకు సంబంధించిన వివరాలను ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్‌కుమార్, ఈవోపీఆర్డీ సాంబశివరావు, సూపర్‌వైజర్ వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌బాబు

కచ్చితమైన కొలతలు, హద్దులతో స్టోన్ ప్లాంటేషన్

తహసీల్దార్ శంకరబాబు

కంచికచర్ల: మండలంలోని పేరకలపాడు, పెండ్యాల గ్రామాల్లో రీ సర్వేలో భాగంగా సర్వే హద్దురాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు తెలిపారు. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేటు భూములను రీ సర్వే చేశామని, ఆ తర్వాత ప్రభుత్వం మంజూరు చేసిన సర్వే హద్దురాళ్లను పాతుతున్నామన్నారు. కచ్చితమైన కొలతలు, హద్దులు ఉండేలా రీ సర్వే చేశామన్నారు. మండలంలోని చెవిటికల్లు, మున్నలూరు గ్రామాల్లో భూముల రీ సర్వే చేపడుతున్నామని, ప్రతి ఒక్క రైతు గ్రౌండ్ ట్రూతింగ్‌కు హాజరుకావాలని అన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకువచ్చి సర్వే చేసే సమయంలో రెవెన్యూ సిబ్బందికి రైతులు పూర్తి సమాచారంతో సహకరించాలన్నారు. కౌలు రైతులు కూడా భూయజమానులకు విధిగా రీ సర్వే గురించి తెలియపర్చాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ ఎస్.అనూష్‌కుమార్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



పెండ్యాలలో సర్వే హద్దురాళ్లను దగ్గరుండి పాతిస్తున్న తహసీల్దార్ శంకరబాబు

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన మోగులూరు జెడ్పీ విద్యార్థులు

కంచికచర్ల: పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించటంతో పాటు పలు క్రీడల్లో మంచి తర్ఫీదు ఇస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు రాంబాబు అన్నారు. మండలంలోని మోగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన తమ పాఠశాల విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ ఆటలో మంచి ప్రతిభ కనపర్చి ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.
మొత్తం 10మంది విద్యార్థులు తమ ప్రతిభ కనపర్చి పాఠశాలకు పేరు తీసుకువచ్చారని అన్నారు. అనంతరం వారిని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో పీడీ మెహబూబాబీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మోగులూరు జెడ్పీ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రాంబాబు, పీడీ మెహబూబాబీ

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 5 వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో, ఖాళీ పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కువ రోజులపాటు నీరు నిల్వ ఉండడం వలన దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వార్డులో జరుగుతున్న ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

విద్యార్థులకు సులభరీతిలో విద్యాబోధన చేయాలి

గంద్రాయి(జగ్గయ్యపేట): ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈవో చిట్టిబాబు అన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం విద్యలో అనేక నూతన మార్పులు తీసుకువచ్చిందని, తదనుగుణంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సత్సంబంధాలను అలవర్చుకోవాలని చెప్పారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ సత్యనారాయణ, కార్యదర్శి రమేష్, ఆర్‌పీవోలు రామారావు, కొండయ్య చారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో చిట్టిబాబు

భవిష్య నిధిపై అవగాహన సదస్సు

పెనుగంచిప్రోలు:గ్రామంలోని తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో గల గోపయ్య సదన్ లో నిధి ఆప్ కే నికట్(భవిష్య నిధి మీ చెంతకు) కార్యక్రమంపై బుధవారం భవిష్యనిధి జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఈపీఎఫ్ అధికారి శేఖర్ శర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి భవిష్యనిధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.
కార్యక్రమంలో ఆలయ డీఈ తిరుమలేశ్వరరావు, ఆలయ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.